సాక్షి వైఎస్‌ఆర్ జిల్లా

బుధవారం, 10, మే, 2023



అంతర్ రాష్ట్ర బైక్ దొంగల అరెస్ట్

జల్సాలకు అలవాటుపడి బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అంతర్ రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



భర్తను అడ్డు తొలగించుకునే యత్నం

ప్రియుడితో కలిసి ఏకంగా భర్తపైనే హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సిద్దవటం మండలంలో చోటు చేసుకుంది. - 8లో



అన్నను చంపిన తమ్ముడి అరెస్ట్

కడప నగరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అన్నను హత్య చేసిన కేసులో నిందితుడైన తమ్ముడిని పోలీసులు అరెస్టు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీలక్ష్మీ మహాయజ్ఞానికి ఆహ్వానం

కడప సెవెన్‌రోడ్స్ : లోక కల్యాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న అష్టోత్తర శతకుండాత్మక (108) చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత 'శ్రీ లక్ష్మీ మహాయజ్ఞానికి' జిల్లా వాసులు తరలి రావాలంటూ ప్రభుత్వం పంపిన ఆహ్వాన శుభ పత్రికను మంగళవారం కలెక్టర్ విజయరామరాజు ఆవిష్కరించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టయిశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ మహాయజ్ఞాన్ని జిల్లా ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేసీ గణేష్ కుమార్, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో గంగాధర్‌గౌడ్, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ స్పెషల్ కోర్సుల్లో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని హెలెన్ కెల్లర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుకు ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ దౌలత్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరానికి బీ కేటగిరిలో ప్రవేశాలు జరుగుతాయన్నారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు చేసినవారు బధిరుల ప్రత్యేక పాఠశాలలు, సాధారణ పాఠశాలలు, మరియు భవిత కేంద్రాలలో ఉపాధ్యాయులుగా అర్హులన్నారు. వివరాలకు 9966006758, 9849311680 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సర్వీసులు వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : వేలాంగిణికి నడుపుతున్న ప్రత్యేక బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కడప, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు డిపోల నుంచి ఈ నెల 12వ తేదీన వేలాంగిణికి ప్రత్యేక సర్వీసు నడుపుతున్నామన్నారు. తిరుపతి, తిరుత్తణి, కంచి, నాగపట్నం మీదుగా వేలాంగిణికి చేరుకుంటాయన్నారు. వీటికి రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని తెలిపారు. అలాగే ప్రతి సోమవారం నిత్యపూజకోన, పొలతలకు కూడా ప్రత్యేక బస్సులను నడుపుతున్నామన్నారు.

మంగంపేట నిర్వాసితులకు రూ.100 కోట్ల పరిహారం

రైల్వేకోడూరు: నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె మండలం మంగంపేటలో గ్రామాల తరలింపు, నిర్వాసితులకు పునరావాసం, పరిహారం చెల్లింపు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.100 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. గ్రామస్తులు ఎంపీ మిథున్‌రెడ్డికి, ఎమ్మెల్యే శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలకు మెరుగైన పరిష్కారమే..

జగనన్నకు చెబుదాం



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, నగరమేయర్ సురేష్‌బాబు, అడ చైర్మన్ గురుమోహన్, రాష్ట్ర ఉద్యాన సలహాదారు శివప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జల వెంకటలక్ష్మి తదితరులు

- ప్రభుత్వ పథకాలు, సేవలపై టోల్‌ఫ్రీ నంబర్ 1902
- లాంఛనంగా ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి
- హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజా వినతులకు మెరుగైన, నాణ్యమైన పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న "జగనన్నకు చెబుదాం" కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి లాంఛనంగా ప్రారంభించారు. వినతుల స్వీకరణకు టోల్‌ఫ్రీ నంబరు 1902 కేటాయించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, కల్యాణమస్తు, షాదీతోఫా తదితర సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజలకు ఏవైనా వ్యక్తిగత స్థాయిలో సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి విన్నవించుకోవచ్చు. అలాగే భూముల మ్యూటేషన్స్, పట్టాదారు పాసుపుస్తకాలు, రేషన్‌కార్డులు, పెన్షన్ కానుక, ఆరోగ్యశ్రీ సేవలు వంటివి పొందాలనుకునే వారు కూడా జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వినతులు సమర్పించవచ్చు. ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటుంది. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, నగరమేయర్ సురేష్‌బాబు, అడా చైర్మన్ గురుమోహన్, రాష్ట్ర ఉద్యాన సలహాదారు శివప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జల వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు.

పటిష్టంగా అమలు చేస్తాం – కలెక్టర్, ఎస్పీ

జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తామని కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్ ముఖ్యమంత్రితో ఈ సందర్భంగా అన్నారు. ప్రభుత్వ అధికారుల పనితీరు బాగుంటేనే పాలన కూడా సంతృప్త స్థాయిలో సాగుతుందనే ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెడతామన్నారు. సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరిస్తూ అన్ని వర్గాల ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా చూస్తామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, మండల, డివిజన్, జిల్లా స్థాయి వరకు కార్యక్రమం వంద శాతం విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. వినతులను పారదర్శకంగా, నాణ్యంగా పరిష్కరిస్తామని చెప్పారు. పోలీసు యంత్రాంగాన్ని కూడా ఈ విషయంలో మరింత పటిష్ట పరుస్తామని చెప్పారు. సచివాలయ స్థాయిలోని మహిళా పోలీసు నుంచి జిల్లా స్థాయి వరకు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టేందుకు టీములు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమస్యలు లేని జిల్లాగా రాష్ట్రంలో ముందు నిలుపుతామన్నారు.

సీనియర్ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణ

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ విజయరామరాజు అధికారులతో మాట్లాడుతూ...జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారులు నెలకు రెండు పర్యాయాలు జిల్లాలో పర్యటిస్తారని తెలిపారు. ప్రజా వినతులు పరిష్కరించేందుకు, నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి స్వీయ పరిశీలనలో, సీఎంఓ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుంది గనుక అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ విజయవంతం చేయాలన్నారు. ప్రస్తుతమున్న స్పందన కంటే మెరుగ్గా ఈ కార్యక్రమం ద్వారా అర్జీలు పరిష్కారం అవుతాయన్నారు. కాల్స్ స్వీకరణ, ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్ సందేశాలు, ఫీడ్‌బ్యాక్ వంటివి ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, ఏఎస్పీ ప్రేరణకుమార్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప డివిజన్ పరిధిలోని కడప అర్బన్, రూరల్, కమలాపురం, సిద్దవటం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో అంగన్వాడీ వర్కర్లు, ఆయాల పోస్టులకు మంగళవారం ప్రశాంతంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి మాట్లాడుతూ నలుగురు కార్యకర్తలు, 20 మంది ఆయాలు, ఒక మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. ఎవరూ ఎలాంటి ప్రలోభాలకు గురి కారాదని, అర్హులైన వారితో నియామకాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఉమామహేశ్వరరావు, సీడీపీఓలు సునంద, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు పూర్తి చేయండి

జిల్లా కలెక్టర్ విజయరామరాజు



అభివృద్ధి పనుల పురోగతిపై చర్చిస్తున్న కలెక్టర్ విజయరామరాజు, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందులలో రూ.631కోట్ల వ్యయంతో చేపట్టిన దాదాపు 29 రకాల అభివృద్ధి పనులను శరవేగంగా చేపట్టాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్దేశించిన గడువు లోపు జరుగుతున్న అభివృద్ధి పనులన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రోజు అధికారులు పనులు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. అనంతరం ఇప్పటివరకు జరిగిన పనుల గురించి అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అంతకు ముందు కలెక్టర్ గరండాల్ వంక, నగర వనం, క్రికెట్ స్టేడియం, షాపింగ్ కాంప్లెక్స్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ గదుల పనులను పరిశీలించారు. అలాగే న్యాక్ శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, పీసీబీ రాష్ట్ర డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి, అన్ని శాఖల అధికారులు, శిక్షణ నిర్వాహకులు మనీష్‌కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షసూచన

కడప అగ్రికల్చర్: బుధవారం నుంచి ఈ నెల 14 వరకు పలు మండలాల్లో వర్షం పడే అవకాశం ఉందని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ వీరయ్య, వాతావరణ విభాగ శాస్త్రవేత్త స్వామి చైతన్యలు తెలిపారు. , 14వ తేదీ మాత్రం ఉమ్మడి కడప జిల్లాలోని అన్ని మండలాల్లో వర్షసూచన ఉందన్నారు.

కృషితోనే లక్ష్యసాధన



సదస్సులో మాట్లాడుతున్న సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: కృషితోనే లక్ష్యం సాధించగలమని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. 'మను'లో స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ అధ్యక్షతన కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటే సగం విజయం దక్కినట్లే అన్నారు. కార్యక్రమంలో మను ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్, కళాశాల ప్రోగ్రాం అధికారి మొహమ్మద్ సికిందర్ హుస్సేన్, హెచ్‌ఓడీలు హకీముద్దీన్, విలాయత్ అలీబేగ్, ఖాజామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు ప్రారంభం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశం పొందిన తొలి బ్యాచ్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కడపలోని శ్రీహరి డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో నిర్వహించిన పరీక్షలను వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వరరెడ్డి, లలితకళల విభాగం ఆచార్యులు డా.మూల మల్లికార్జునరెడ్డి, లలితకళ విభాగం సమన్వయకర్త డా. కోట మృత్యుంజయరావు పర్యవేక్షించారు. కూచిపూడి నృత్యం, కర్నాటక సంగీతం, కీబోర్డు కోర్సులకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. బుధవారం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఈనెల 18వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు.



పరీక్షలను తనిఖీ చేస్తున్న వైవీయూ అధికారులు

పాలిసెట్‌కు సర్వం సిద్ధం

- నేడు జిల్లావ్యాప్తంగా పాలిసెట్ ప్రవేశ పరీక్ష
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభం
- జిల్లా వ్యాప్తంగా 23 కేంద్రాల్లో పరీక్ష
- కడపలో 13, ప్రొద్దుటూరులో 10 కేంద్రాలు
- హాజరుకానున్న 7879 మంది విద్యార్థులు



కడపలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్పెషల్ అబ్జర్వర్ లలిత, పాలిసెట్ కో ఆర్డినేటర్ సిహెచ్ జ్యోతి

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ఈనెల 10వ తేదీ బుధవారం నిర్వహించనున్న పాలిసెట్–2023 ప్రవేశ పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. జిల్లాలో 23 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో కడపలో 13 పరీక్షా కేంద్రాలు, ప్రొద్దుటూరులో 10 కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 7879 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. కడపలోని 13 పరీక్షా కేంద్రాలలో 3830 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా ప్రొద్దుటూరులోని 10 కేంద్రాలలో 4049 మంది రాయనున్నారు.

పరీక్షా కేంద్రాలలో అన్ని వసతులు సిద్ధం..

పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసే కేంద్రాల్లో విద్యార్థులకు కావాల్సిన అన్ని రకాల వసతులను అధికారులు సిద్ధం చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలోను విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు వడదెబ్బను ఎదుర్కొనేందుకు కావాల్సిన అన్ని రకాల మందులను సిద్ధంగా ఉంచారు. అలాగే లైటింగ్ తక్కువగా ఉన్న పరీక్షా కేంద్రాలలో విద్యుత్తు సౌకర్యం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు.

కడపలో పరీక్షా కేంద్రాలు, విద్యార్థుల వివరాలు ఇలా...

కడపలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో 480 మంది, బాలుర పాలిటెక్నిక్‌లో 600 మంది, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా కళాశాలలో 300 మంది, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 200, బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 500 మంది, గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో 240 మంది, మున్సిపల్ ఉర్దూ బాలికల హైస్కూల్‌లో 200 మంది, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో 300 మంది, శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో 354 మంది, నాగార్జున డిగ్రీ కళాశాలలో 265 మంది, గురుకుల విద్యాపీఠంలో 40 మంది, శ్రీహరి డిగ్రీ కళాశాలలో 134 మంది, శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో 16 మంది విద్యార్థులు పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాయనున్నారు.

ప్రొద్దుటూరులో వివరాలు ఇలా...

ప్రొద్దుటూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పరీక్షా కేంద్రంలో 250 మంది, వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో 750 మంది, ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాలలో 500 మంది, వైవీఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో 400 మంది, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో 200 మంది, లేపాక్షి డిగ్రీ కళాశాలలో 200 మంది, ఆదిత్య హైస్కూల్‌లో 400 మంది, సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో 240 మంది, లింగాపురంలోని సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 657 మంది, చాపాడు సీబీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో 452 మంది పరీక్ష రాయనున్నారు.

సమయానికంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి



పాలిసెట్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులంతా పరీక్ష సమయానికంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 10 గంటలకే విద్యార్థును పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తాము. ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుంది. 11 గంటల తర్వాత వచ్చిన విద్యార్థులను లోనికి అనుమతించము. విద్యార్థులు తమ వెంట హాల్‌టికెట్‌తో పాటు బాల్ పాయింట్ పెన్ను, హెచ్‌బీ పెన్సిల్, రబ్బరు, మెండర్‌ను తెచ్చుకోవాలి. ఎలక్ట్రానిక్‌కు సంబంధించి ఎలాంటి వస్తువును తీసుకురాకూడదు.

– సిహెచ్. జ్యోతి, జిల్లా పాలిసెట్ కోఆర్డినేటర్, కడప.

పాలిసెట్ పరీక్షా కేంద్రాల పరిశీలన

జిల్లావ్యాప్తంగా బుధవారం నిర్వహించనున్న పాలిసెట్ ప్రవేశ పరీక్షా కేంద్రాలను మంగళవారం స్పెషల్ అబ్జర్వర్ లలిత, పాలిసెట్ కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతిలు పరిశీలించారు. కడపలోని ఎస్వీ ఇంజినీరింగ్, ఎస్వీ డిగ్రీ కళాశాలతోపాటు పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లు.. మౌలిక వసతులపై ఆరా తీశారు.

తెలంగాణ ఇంటర్‌లో మెరిసిన కడప విద్యార్థి


పుట్టా సమణశ్రీ

కడప ఎడ్యుకేషన్ : తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో కడప విద్యార్థిని మెరిసింది. కడప నగరానికి చెందిన పుట్టాయాడ్స్ యజమాని పుట్టా శ్రీ రంగనాథ్, పుట్టా పావణి కుమార్తె పుట్టా సమణశ్రీ ఇంటర్‌ను హైదరాబాదు మాదాపూర్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఎంపీసీ చదువుతోంది. ఫలితాల్లో ఆమె తమ ప్రతిభను చాటింది. 470 మార్కులకుగాను 467 మార్కులు సాధించింది. ఇందులో భాగంగా మ్యాథమాటిక్స్ ఏబీ సబ్జెక్టులలో 75కు 75, ఫిజిక్స్‌లో 60కు 60, కెమిస్ట్రీలో 60కి 60, ఇంగ్లిష్‌లో 98, సంస్కృతంలో 99 మార్కులు సాధించి టాప్‌లో నిలిచింది.

కడప రైల్వే సీఐగా నాగార్జున


నాగార్జున

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వే జీఆర్‌పీ సీఐగా బి.నాగార్జున నియమితులయ్యారు. అన్నమయ్య సీసీఎస్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఈయనను కడప రైల్వే సీఐగా బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఆ స్థానంలో పని చేస్తున్న మహమ్మద్ బాబాను కర్నూలు అడిషనల్ డీజీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని సూచించారు. కాగా నాగార్జున రెండు, మూడు రోజుల్లో బాధ్యతలను స్వీకరించనున్నట్లు తెలియజేశారు.

ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం

లింగాల : లింగాల మండలం పార్నపల్లె గ్రామంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అదేవిధంగా పిడుగుపడి సాకే కుళ్లాయప్ప అనే రైతుకు చెందిన పొట్టేలు మృతి చెందగా.. రెండు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. పసుమూర్తి రమేష్ అనే రైతుకు చెందిన 2.50 ఎకరాల అరటి పంట పూర్తిగా నేలకూలింది. దీంతో సుమారు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన అరటి పంట నేలకూలడంతో రైతు లబోదిబోమంటున్నాడు. తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పిడుగుపాటుకు రైతు మృతి

బి.కోడూరు : మండలంలోని గుంతపల్లె గ్రామానికి చెందిన మూలరామలక్ష్మిరెడ్డి (59) మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. వ్యవసాయ పనుల నిమిత్తం తన పొలానికి వెళ్లిన రామలక్ష్మిరెడ్డి ఆకాశంలో మబ్బులు పట్టడంతో తన పొలంలో ఉన్న నూగుకట్టెను కుటుంబ సభ్యులతో కలిసి కుప్పగా వేస్తుండగా పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. బి.కోడూరు పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈయనకు భార్య గుర్రమ్మతోపాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తహసీల్దారు విద్యాసాగర్, గ్రామ రెవెన్యూ అధికారి నరసింహులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. రామలక్ష్మిరెడ్డి కుడి చెవిపై గాయమై ఉందని, పిడుగుపాటుకు గురైనట్లు వీఆర్‌ఓ పోలీసులకు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ మునిరెడ్డి, రామసుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలు రామలక్ష్మిరెడ్డి మృతదేహానికి నివాళులర్పించడంతోపాటు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

గుడిపాడులో గేదె..

దువ్వూరు : మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో మంగళవారం వర్షంతోపాటు పిడుగు పడటంతో తిరుపతి చిన్న కొండారెడ్డి అనే రైతుకు చెందిన గేదె మృతి చెందింది. రూ.75 వేల విలువ చేసే గేదె మృతి చెందడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు. జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ తులశమ్మ సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వం నుంచి రైతుకు పరిహారం అందించేలా కృషి చేస్తామని తెలిపారు.

భర్తను అడ్డు తొలగించుకునే యత్నం

- ప్రియుడితో కలిసి పథకం
- పెనిమిటిపై హత్యాయత్నం
- నిందితుల అరెస్ట్

ఎన్నో ఆశలతో అతను ఆమెను మనువాడాడు.. కానీ.. ఆమె మాత్రం అంతకుముందే మరొకరితో ప్రేమాయణంలో ఉంది.. ఈ మోజులో పడి కట్టుకున్న భర్తనే కడతేర్చాలనుకుంది. ప్రియుడితో కలిసి పథకం వేసింది. ఇద్దరూ కలిసి అమలు చేశారు. ఆమె భర్తపై ప్రియుడు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఏమీ తెలియనట్లు ఆమె నటించింది. పోలీసుల దర్యాప్తులో ఈ దారుణం వెలుగు చూసింది. నిందితులిద్దరూ కటకటాల పాలయ్యారు.


నిందితుడితో డీఎస్పీ షరీఫ్, సీఐ, ఎస్‌ఐ

సిద్దవటం : ఓ యువతి ప్రియుడితో కలిసి ఏకంగా భర్తపైనే హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సిద్దవటం మండలంలోని కనుమలోపల్లె సమీపంలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం సాయంత్రం సిద్దవటం పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ వెల్లడించారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తికి చెందిన అవ్వారు జ్ఞానేశ్వర్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. మూడు నెలల కిందట కడప హనుమప్ప వీధికి చెందిన నవితతో వివాహం జరిగింది. గత నెల 19వ తేదీన శ్రీకాళహస్తి నుంచి తన భార్యను పిలుచుకొని కడపలోని అత్తగారి ఇంటి వద్దకు తీసుకొని వచ్చాడు. తిరిగి జ్ఞానేశ్వర్ శ్రీకాళహస్తికి వెళ్లాడు. అదే నెల 25వ తేదీన అత్తగారి ఇంటిలో ఉన్న తన భార్యను పిలుచుకొని వెళ్లేందుకు కడపకు వచ్చాడు. ఆరోజు రాత్రి అత్తగారి ఇంట్లోనే బస చేసి మరుసటిరోజు 26వ తేదీన ఉదయం తన భార్యను వెంటబెట్టుకొని కడప నుంచి కారులో శ్రీకాళహస్తికి బయలు దేరాడు. సిద్దవటం మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలోకి రాగానే తనకు వాంతికి వస్తుందని కారు ఆపాలని భర్తతో చెప్పడంతో ఆయన కారును ఆపాడు. ఇంతలోనే అకస్మాత్తుగా కడపలోని హనుమప్ప వీధికి చెందిన జాహ్నవి కాపిష దుర్గేష్‌సింగ్ అక్కడికి వచ్చి జ్ఞానేశ్వర్‌పై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. భార్య నవిత తన కేమీ తెలియనట్లు భర్తను వైద్యం కోసం కడపలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. ఈ ఘటనపై జ్ఞానేశ్వర్ గత నెల 27వ తేదీన సిద్దవటం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా 10 రోజుల్లోనే హత్యాయత్నం కేసును ఛేదించారు. నవితకు వివాహం జరగక ముందే పక్కింటికి చెందిన ఎంబీఏ చదువుతున్న జాహ్నవి కాపిష దుర్గేష్ సింగ్‌తో ప్రేమలో ఉంది. నవితకు వివాహం అయినప్పటికీ భర్త జ్ఞానేశ్వర్‌తో అయిష్టంగానే కాపురం కొనసాగించింది. ఏప్రిల్ 26వ తేదీన భర్తను హతమార్చాలని ప్రియుడితో కలిసి పథకం పన్నింది. కనుమలోపల్లె గ్రామ సమీపంలో వాంతికి వస్తుందని భర్తను నమ్మించి కారును ఆపింది. భర్తపై ప్రియుడి చేత కత్తితో హత్యాయత్నం చేయించింది. ఈ విషయాలు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనకు సంబంధించి మంగళవారం ఉదయం 11 గంటలకు కడప నగరం ఔటర్‌రింగ్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వద్ద నవిత ప్రియుడితో ఉండటంతో సమాచారం రావడంతో వారిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. హత్యాయత్నానికి వినియోగించిన మారణాయుధం, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని సిద్దవటం కోర్టులో హాజరు పరిచారు. అనతి కాలంలోనే కేసును ఛేదించిన సిద్దవటం ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్‌ను, ఆయన సిబ్బందిని జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు. ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, ఎస్‌ఐ తులసీనాగప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ని జాకీలేసినా టీడీపీ లేవదు

– ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



జమ్మలమడుగు : యెల్లో మీడియా టీడీపీని ఎన్ని జాకీలు పెట్టి పైకి లేపే ప్రయత్నం చేసినా లేచే పరిస్థితిలో లేదని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు రాతలను ఎవ్వరూ నమ్మరని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి అన్నారు. జమ్మలమడుగులో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో అన్ని రాష్ట్రాల పాలనకు ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తోందని.. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను తీసుకుని వచ్చి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కు దక్కుతుందన్నారు. గతంలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితముండేది కాదని, ప్రస్తుతం జగన్ పాలనలో నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనే డబ్బు జమ అవుతోందన్నారు. గతంలో 'డయల్ యువర్ సీఎం' అంటూ నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టిన మొక్కుబడి కార్యక్రమం సక్సెస్ కాలేదన్నారు. నేడు ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించుకునేందుకు 1902 నంబర్‌కు ఫోన్ చేస్తే చాలంటూ మన ముఖ్యమంత్రి కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. అయితే యెల్లో మీడియా దీనిని విమర్శిస్తూ పిచ్చి రాతలు రాయడం సరైంది కాదన్నారు. దేశంలో ఎవరూ చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా పట్టించుకోకుండా ఇలాంటి వార్తలు రాయడం వల్ల టీడీపీకి మేలు జరుగుతుందనుకోవడం భ్రమలో బతకడమే అవుతుందన్నారు.

అంతర్ రాష్ట్ర బైక్ దొంగల అరెస్ట్


మోటార్ సైకిళ్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : చెడు వ్యసనాలకు బానిసలుగా మారి జల్సాలకు అలవాటుపడి బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అంతర్ రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.16 లక్షల విలువైన 21 బైక్‌లను రికవరీ చేశారు. మంగళవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వివరాలు వెల్లడించారు. అరెస్ట్ అయిన వారిలో జిల్లాలోని ఎర్రగుంట్ల టౌన్ సుందరయ్య నగర్‌కు చెందిన మల్లెపోగు ప్రసాద్, మైలవరం మండలం బుబుసానిపల్లెకి చెందిన గువ్వల పుల్లారెడ్డి, ఎర్రగుంట్ల అంబేడ్కర్ నగర్‌కు చెందిన దండు నరసింహులు, ప్రకాష్‌నగర్‌కు చెందిన పిక్కిలి చరణ్‌కుమార్ వున్నారు. నిందితులు సీసీ కెమెరాలు లేని ప్రదేశంలో పార్కింగ్ చేసిన మోటార్ సైకిళ్లను లక్ష్యంగా చేసుకుని మారు తాళాలను ఉపయోగించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైఎస్ఆర్ కడప జిల్లాతోపాటు, అనంతపురం, శ్రీసత్యసాయి, నంద్యాల, కర్నూలు జిల్లాలు, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుంచి గత ఆరు నెలల కాలంలో 25 మోటార్ సైకిళ్లను దొంగలించారు. ఎర్రగుంట్ల పీఎస్ పరిధిలో మూడు, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ఒకటి, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ, శ్రీశైలం పీఎస్ పరిధిల్లో రెండు, సత్యసాయి జిల్లా బత్తలపల్లెలో, సి.కొత్తపల్లెలో రెండు, అనంతపురం 4వ పట్టణ పోలీస్‌స్టేషన్, గుంతకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు మోటార్ సైకిళ్లు, తెలంగాణా రాష్ట్రం సైఫాబాద్, ముషిరాబాద్, శంషాబాద్ పరిధిలో ఏడు మోటార్ సైకిళ్లు, కర్ణాటక రాష్ట్రంలో వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు మోటార్ సైకిళ్లు దొంగలించినట్లు తమ విచారణలో తేలిందని ఎస్పీ తెలిపారు. నిందితులను ఈ నెల 8వ తేదీ సాయంత్రం ఎర్రగుంట్ల టౌన్ సమీపంలో ఐసీఎల్ ఫ్యాక్టరీ దగ్గరలో అదుపులోకి తీసుకుని 21 మోటార్ సైకిళ్లను రికవరీ చేశామన్నారు. వీటి విలువ సుమారు రూ. 16 లక్షలుగా వుంటుందని తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో మోటార్ సైకిళ్ల రికవరీలో చాకచక్యంగా వ్యవహరించిన జమ్మలమడుగు డీఎస్పీ ఎన్.నాగరాజు, ఎర్రగుంట్ల అర్బన్ పీఎస్ సీఐ ఎం.మంజునాథరెడ్డి, ఎస్‌ఐలు బి.వి కృష్ణయ్య, పి.ప్రవీణ్‌కుమార్, కానిస్టేబుళ్లు పి.సంజీవరాయుడు, కె.జయచంద్ర, ఆర్.వీరాంజనేయులు, యం.జి మహేష్, బి.వి ప్రసాద్ రెడ్డిలను ఎస్పీ అభినందించారు.

ఆస్తి కోసం తండ్రి దారుణ హత్య

- మద్యం మత్తుకు బానిసలైన కుమారుడు, మనవడు
- డబ్బులు ఇవ్వడం లేదని అంతమొందించిన వైనం


మృతి చెందిన రామకృష్ణారెడ్డి

ఖాజీపేట : వృద్ధాప్యం వచ్చిన వ్యక్తికి తోడు నీడగా ఉండాల్సిన కుమారుడు, మనవడు.. ఆయన పాలిట హంతకులుగా మారారు. తాగుడుకు బానిసలైన వారు అడిగినప్పుడు డబ్బులు ఇవ్వక పోవడం, ఆస్తి అంతా తమ పేరున రాసి ఇవ్వక పోవడంతో కడతేర్చిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఖాజీపేట మండలం కుమ్మరకొట్టాలు గ్రామానికి చెందిన కల్లూరి రామకృష్ణారెడ్డి, భార్య రామసుబ్బమ్మకు దశరథ రామిరెడ్డి అనే కుమారుడు ఉన్నాడు. అతనికి రాంభూపాల్‌రెడ్డి అనే కుమారుడు ఉన్నాడు. దశరథ రామిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి పూర్తిగా మందుకు బానిసలుగా మారినట్లు గ్రామస్తులు అంటున్నారు. తరచుగా డబ్బులు ఇవ్వాలని తండ్రి రామకృష్ణారెడ్డితో గొడవ పడుతుండే వారని చెబుతున్నారు. ఆస్తి అంతా రామకృష్ణారెడ్డి పేరునే ఉండటంతో అమ్ముకునేందుకు వీలు లేకుండా ఉండేదని అంటున్నారు. ఆస్తి కోసం పలుమార్లు తండ్రితో దశరథరామిరెడ్డి గొడవ పడుతుండేవారట. ఆస్తి ఇవ్వక పోవడంతో చివరకు మంగళవారం హత్య చేసినట్లు తెలుస్తోంది. కల్లూరి రామృష్ణారెడ్డి(72 ఇంటిలో నిద్రపోతున్న సమయంలో కుమారుడు అయిన దశరథరామిరెడ్డి (48), మనవడు రాంభూపాల్‌రెడ్డి (20) కలసి తెల్లవారుజామున ఎత్తుకు వెళ్లారు. తమ పొలంలోనే గొంతు నులిమి హత్య చేసి పరారయ్యారు. అయితే రోజువారి పనుల్లో భాగంగా మృతుడి భార్య రామసుబ్బమ్మ పొలం వద్దకు వెళ్లగానే భర్త కింద పడి ఉండటం గమనించి బంధువులకు సమాచారం ఇచ్చింది. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించి మైదుకూరు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో రామసుబ్బమ్మ ఫిర్యాదు చేసింది. తన భర్తను కుమారుడు, మనవడు కలిసి చంపారని ఆమె పేర్కొంది. ఈ మేరకు మైదుకూరు అర్బన్ సీఐ చలపతి కేసు నమోదు చేశారు. మృత దేహాన్ని శవ పరీక్షల నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. మృతికి గల కారణాలపై విచారణ చేపట్టారు. పంచనామా పూర్తి అయిన తరువాత డాక్టర్ రిపోర్టు మేరకు మృతికి కారకులైన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కమనీయం.. కల్యాణం


స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

జమ్మలమడుగు : జమ్మలమడుగులోని నారాపుర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరుడి కల్యాణం కనులవిందుగా జరిగింది. మంగళవారం ఉదయం వేద పండితులు స్వామి వారిని సర్వభూపాలుడిగా అలంకరించారు. అనంతరం పురవీధుల మీదుగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆరుగంటలకు శ్రీదేవి, భూదేవిలతో నారాపుర వెంకటేశ్వర స్వామికి కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి కల్యాణం వీక్షించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తిరుమల తిరుపతికి చెందిన వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య స్వామి వారి వివాహాన్ని వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం 9 గంటలకు స్వామి వారికి రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

వైఎస్‌ఆర్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జిపై దాడి


చికిత్స పొందుతున్న గోపినాథ్

చింతకొమ్మదిన్నె : కడప నగర సమీపంలోని రింగు రోడ్డు వద్ద గల అంబేడ్కర్ సర్కిల్‌లో సోమవారం 16వ డివిజన్ కార్పొరేటర్ లక్ష్మీదేవి భర్త అయిన డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ గోపినాథ్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేర్చి, అక్కడున్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రిమ్స్ ఔట్‌పోస్ట్ పోలీసులు సికెదిన్నె పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్‌ఐ భూమా అరుణ్‌రెడ్డి తెలిపారు. పలువురు వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు రిమ్స్‌కు వెళ్లి గోపినాథ్‌ను పరామర్శించారు.

బస్సు దిగుతూ వ్యక్తి మృతి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని వెంకటేశ్వరస్వామి గుడి వెనుకవైపు ఉన్న మర్రి చెట్టు వద్ద మంగళవారం సాయంత్రం బస్సు దిగుతూ నబీ రసూల్ (38) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సింహాద్రిపురం మండల సమీపంలోని వెంకటాంపల్లె గ్రామానికి చెందిన నబీ రసూల్ పనుల నిమిత్తం కదిరికి వెళ్లే పులివెందుల బస్సు ఎక్కాడు. వెంకటేశ్వరస్వామి గుడి వెనుకవైపు ఉన్న మర్రి చెట్టు వద్దకు రాగానే బస్సు దిగుతుండగా.. బస్సు కదలడంతో కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నబీ రసూల్‌ను 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కడపకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామం రాజీవ్‌నగర్‌లో కాపురం ఉంటున్న పి.ఓబులేసు (39) అనే వ్యక్తి మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. గత కొంత కాలంగా ఆయన రాజీవ్‌నగర్‌లో భార్యతో కలసి కాపురం ఉంటున్నాడు. ఇతను పట్టణంలోని రైస్‌మిల్లులో గుమస్తాగా పని చేస్తున్నాడు. భార్య కూలీ పనులకు వెళ్లిన సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆమె ఇంటికి వచ్చిన తరువాత గమనించి స్థానికుల సాయంతో కిందకు దించింది. విషయం తెలుసుకున్న పట్టణ పోలీస్‌లు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై ఆరా తీస్తున్నారు. ఆత్మహత్య సంఘటనపై పలువురు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

డీసీసీబీ కోసం స్థల పరిశీలన


పాత తహసీల్దార్ భవనం పరిశీలిస్తున్న జేసీ

దువ్వూరు : దువ్వూరులో డీసీసీ బ్యాంకు భవనం, ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ మంగళవారం స్థలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కేసీ కెనాల్ బంగ్లా ఆవరణలోని ఖాళీ స్థలాలను, పాత తహసీల్దార్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన పాత దువ్వూరులోని ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి గ్రామ కంఠాలను, దువ్వూరు సెంటర్‌లోని పోలీసు క్వార్టర్స్‌ను పరిశీలించారు. త్వరలోనే డీసీసీ బ్యాంకు సొంత భవనానికి స్థలం, ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి స్థలం కోసం నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు అందిస్తామని జేసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ రమకుమారి, ఆర్‌ఐ జాన్సన్, సర్వేయర్ పద్మావతి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

లారీలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి ప్రధాన రహదారిలో మండలంలోని యామవరం గ్రామ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. సీఐ నరేష్ బాబు సమాచారం మేరకు.. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో యామవరం వద్ద తాడిపత్రి వైపు నుంచి ముద్దనూరుకు వస్తున్న లారీని యర్రగుంట్ల వైపు నుంచి ప్రయాణిస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో తాడిపత్రి వైపు నుంచి వస్తున్న లారీలోని అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన డ్రైవరు రాగుల రంగస్వామి(64) అనే వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. బాధితుడిని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. మరో లారీలోని డ్రైవరు వెంకటరెడ్డి గాయాల పాలయ్యాడు. ఈ ప్రమాదంలో లారీల ముందుభాగం నుజ్జునుజ్జయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అన్నను చంపిన తమ్ముడి అరెస్ట్

- 24 గంటల్లోనే నిందితుడిని పట్టుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న కడప డీఎస్పీ ఎండీ షరీఫ్

కడప అర్బన్ : కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సర్ఖాజీపుర వీధిలో ఈ నెల 7న అర్ధరాత్రి సమయంలో తన అన్న షేక్ మహమ్మద్ ఇసాక్ (25)ను తమ్ముడు అబుబసర్ అలియాస్ అబ్బు ఆగ్రహావేశంతో హత్య చేశాడు. ఈ సంఘటనలో నిందితుడు షేక్ అబుబసర్ అలియాస్ అబ్బును పోలీసులు 24 గంటల్లోనే ఈ నెల 8వ తేదీ(సోమవారం) సాయంత్రం 7 గంటల సమయంలో గౌసనగర్ కేసీ కెనాల్ సమీపంలో అరెస్ట్ చేశారు. అతని దగ్గరి నుంచి హత్యకు ఉపయోగించిన పిడిబాకును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. మంగళవారం కడపలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ వివరాలు వెల్లడించారు. కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నబెస్తవీధిలో నివాసం వుంటున్న షేక్ రషీదాభానుకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరిలో పెద్ద కుమారుడు, కాస్త మతిస్థిమితం సరిగాలేని షేక్ మహమ్మద్ ఇలియాస్, తన స్నేహితుడు పీరుల్లాఖాన్‌తో కలిసి అప్పుడప్పుడు మద్యం సేవించేవాడు. ఈక్రమంలోనే పండ్ల వ్యాపారి దగ్గర పని చేసి వచ్చిన తరువాత సంపాదన డబ్బుల్లో కొంత తీసుకుని ఆదివారం రాత్రి అమీన్ ఫంక్షన్ హాల్ దాటిన తరువాత సర్ఖాజీ పుర వీధిలో కంప చెట్లలో మద్యం సేవించి వస్తుండగా.. చిన్న తమ్ముడు షేక్ అబుబసర్ పెద్దన్నను, అతని స్నేహితుడిని చూసి ఎందుకు మీరు ఇలా తిరుగుతున్నారని వారితో వాగ్వివాదానికి దిగాడు. ఆ సమయంలో షేక్ ఇలియాస్ తన రెండవ తమ్ముడు షేక్ మహమ్మద్ ఇసాక్‌ను పిలిచాడు. ఇసాక్ వచ్చీరాగానే తన అన్న మాటలు విని.. అబుబసర్ చెంపకేసి మూడు దెబ్బలు కొట్టాడు. దీంతో అప్పటికే తన దగ్గర దాచి వుంచిన పిడిబాకుతో, ఆగ్రహావేశంతో ఊగిపోయి సొంత అన్నను నాలుగు పోట్లు పొడిచాడు. రక్తపు మడుగులో ఇసాక్ కుప్పకూలి పడిపోయి, చనిపోయాడు. తర్వాత షేక్ అబుబసర్ పిడిబాకుతో సహా పరారయ్యాడు. అతన్ని 24 గంటల్లోపే పోలీసులు సోమవారం రాత్రి గౌసనగర్ కేసీ కెనాల్ సమీపంలో అరెస్ట్ చేయడంతోపాటు, అతని వద్ద నుంచి పిడిబాకును స్వాధీనం చేసుకున్నారు. పిడిబాకును అబ్బు ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేసుకుని తెప్పించుకున్నట్లు తెలుస్తోంది.

పిల్లల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలి

పిల్లలకు యుక్తవయసు రాగానే వారి ప్రవర్తనపై తల్లిదండ్రులు నిఘా వుంచి, ఇంటికి ఎన్ని గంటలకు వస్తున్నారు, వారి నడవడిక ఎలా వుందనే విషయంపై అప్రమత్తంగా వ్యవహరించాలని డీఎస్పీ ఎండీ షరీఫ్ సూచించారు. వారు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా పోలీసు శాఖ తరపున తమవంతుగా కృషి చేస్తామన్నారు. నగరంలో బైక్ రేసింగ్‌లు, వాహనాలను వేగంగా నడుపుతున్న మైనర్లపై నిఘా వుంచుతామన్నారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్‌ను ఇస్తామన్నారు. ఈ హత్య సంఘటనలో నిందితుడిని 24 గంటల్లోపే పట్టుకుని అరెస్ట్ చేసిన కడప టూటౌన్ సీఐ సయ్యద్ హాసం, ఎస్‌ఐలు యు.వై.జయరాములు, ఎం.ఎస్.సంజీవరాయుడు, ఏఎస్‌ఐ భాస్కర్, హెడ్‌కానిస్టేబుళ్లు సుధాకర్ నాయక్, తిరుపాలు, రాము, కానిస్టేబుళ్లు వి.తిరుపతయ్య, ఐ. శివకిషోర్, రఘురాముడును జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ అభినందించారు.